సాక్షి బాపట్ల

బుధవారం । 3 । మే । 2023



ఎదుర్కోలు ఉత్సవం

కోడూరు (కృష్ణా జిల్లా): ఉల్లిపాలెం గోదా. రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.4,700, మోడల్ ధర రూ.3,400 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

యార్డుకు 1,10,810 బస్తాల మిర్చి



కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,10,810 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,07,030 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 74,386 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఆటోనగర్‌కు ప్రణాళికలు సిద్ధం చేయండి

ఆదేశించిన పల్నాడు కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఆటోనగర్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆటోనగర్ ఏర్పాటుకు కేసానుపల్లి గ్రామం వద్ద 37.53 ఎకరాలను గుర్తించినట్లు ఏపీఐఐసీ మేనేజర్ గోపీకృష్ణ, ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్ ఆర్వీ రమణా నాయక్ జిల్లా కలెక్టర్‌ను మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో కలిసి తెలిపారు. దీనికోసం నరసరావుపేట మోటార్ వెహికల్ వర్కడ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ సొసైటీతో సుదీర్ఘంగా చర్చించామన్నారు. దీనిపై వెంటనే ఆటోనగర్ ఏర్పాటుకు సిద్ధం కావాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.10 అడుగుల వద్ద ఉంది. ఇది 153.1325 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 900 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజుకు తుది గడువు నేడు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు తుది గడువు బుధవారం ముగియనుందని ఆర్‌ఐవో జి.సునీత మంగళవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలల నుంచి గత మార్చిలో జరిగిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులు బుధవారం సాయంత్రం లోపు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఈనెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పబ్లిక్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులతో విధిగా దరఖాస్తు చేయించాలని ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు.

పిడుగురాళ్లలో కుండపోత



పిడుగురాళ్ల: పట్టణంలో మంగళవారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం మొదలైన వర్షం రాత్రి వరకు నిరంతరం కుండపోతలాగా కురుస్తూనే ఉంది. ప్రధాన రహదారులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. గృహాల వద్ద సైడ్ కాలువలన్నీ వర్షం నీటితో పరుగులుదీశాయి. వేసవిలో ఇలా కుండపోత వర్షం కురవడం ఇదే ప్రథమమని పట్టణ వాసులు పేర్కొన్నారు. వర్షాకాలంలో మాదిరిగా వర్షం కురుస్తుండటంతో వాతావరణమంతా ఒక్కసారిగా చల్లబడిపోయింది. నాలుగు రోజుల వరకు ఎండలతో అల్లాడిన పల్నాటి వాసులకు ప్రస్తుత వాతావరణం ఆహ్లాదపరిచింది. పట్టణ శివారులో వర్షం కారణంగా పట్టపొలాల్లో, కల్లాల్లో ఉన్న మిర్చిని కాపాడుకునేందుకు రైతులు పరుగుదీశారు.

సమగ్రాభివృద్ధే ధ్యేయం

వ్యవ'సాయనికి' పెద్దపీట

- ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు
- అసైన్డ్ భూముల్లో పట్టాలిచ్చేందుకు నిర్ణయం
- జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ, వేదికపై మంత్రి మేరుగ నాగార్జున

బాపట్ల: జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి మండలి సమావేశం మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ హాలు జరిగింది. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరతో 40 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. జిల్లాలో నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు 499 ఎకరాల భూమిని పంపిణీ చేయడానికి అసైన్డ్‌మెంట్ కమిటీ అధికారికంగా ఆమోదించిందని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. ఎస్సీలలో 367 మంది, ఎస్టీలలో 90 మంది, బీసీలలో 15 మంది, ఓసీలలో 27 మందికి అసైన్డ్‌మెంట్ భూములను అందజేయనున్నామని తెలిపారు. ధాన్యానికి ఇతర రాష్ట్రాల కంటే ఏపీలోనే మంచి ధర లభిస్తోందని ఉపముఖ్యమంత్రి చెప్పారు. లక్ష్యం మేరకు బాపట్ల జిల్లాలో ధాన్యం సేకరణ పూర్తయిందని, మరో 20 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని శాసనసభ్యులు కోన రఘుపతి కోరడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీ నియమించాలన్నారు. జిల్లాలో పండిన పసుపు పంటను కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. రైతుపక్షపాత ప్రభుత్వంగా ఆయన అభివర్ణించారు. రబీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

తాగు–సాగునీటి సమస్య రానివ్వద్దు

తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఉపముఖ్యమంత్రి సత్యనారాయణ ఆదేశించారు. ముఖ్యంగా సాగునీటి కాలువల పూడికతీత పనులు, మరమ్మతులు చేపట్టాలని, ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. దెబ్బతిన్న మొక్కజొన్న పంటలు గుర్తించడానికి సర్వే చేయాలన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాడు–నేడు కార్యక్రమంతో వైద్యశాలల్లో ఖాళీ పోస్టులన్నీ భర్తీ అయ్యాయని, మెరుగైన వైద్యం అందిస్తున్నారని చెప్పారు. 2వ దశలో 543 పాఠశాలలను రూ.192 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. దేశ చరిత్రలోనే ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడా జరగలేదన్నారు. మే 15వ తేదీలోగా ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలకు పెండింగ్ బిల్లులు అన్ని చెల్లిస్తామన్నారు. అభివృద్ధిలో బాపట్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. వేసవిలో నిరుపేదలకు ఉపాధి కల్పించేలా ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పనులు విస్తృతంగా చేపట్టాలన్నారు.

నిజాంపట్నం ఓడరేవును అభివృద్ధి చేస్తుండగా మరోవైపు సీఎం ప్రత్యేక చొరవతో ఆక్వా రంగాన్ని మరింత విస్తృతం చేస్తున్నారని తెలిపారు. ఎస్.డి.బి.పి ద్వారా బాపట్ల జిల్లాలోని రహదారులన్నీ అభివృద్ధి చేయాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన పనులలో రాజీపడొద్దనీ, జాప్యం చేయవద్దని ఆయన సూచించారు. సూక్ష్మ, బిందు, తుంపర సేద్యంతో సాగు విస్తీర్ణాన్ని మరింతగా పెంచాలన్నారు. పశువైద్యాధికారుల కొరత కొంత తీరిందని, నాణ్యమైన వైద్యం పశువులకు క్షేత్రస్థాయిలో అందుతుందన్నారు. బాలలకు మెరుగైన విద్యను అందించడానికి నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని వివరించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టరు సి.హెచ్. శ్రీధర్, ప్రకాశం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆర్.ఓ కె. లక్ష్మీ శివ జ్యోతి, బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జున, ఆర్.డి.ఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టిపెట్టాలి



గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటి రవాణాకు చర్యలు తీసుకోవాలి. వేమూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించడం లేదు. దెబ్బతిన్న మొక్కజొన్న పంటను తక్షణమే కొనుగోలు చేయాలి.

– మేరుగ నాగార్జున, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి

ధాన్యం కొనుగోలు చేపట్టాలి



లేటు ఖరీఫ్‌లో వచ్చిన ధాన్యం దిగుబడిని అధికారులు కొనుగోలు చేయాలి. అకాల వర్షంతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి. పంట కాలువలు పూడికతీత పనులు చేపడితే వ్యవసాయరంగానికి ఎంతో మేలు జరుగుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మోపిదేవి, రాజ్యసభ సభ్యులు

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. బాపట్ల జిల్లాలోని చెరువులన్నింటినీ పూర్తిస్థాయిలో నింపాం. జూలై వరకు తాగునీటి సమస్య ఉండదు. గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి రవాణాకు అన్ని చర్యలు తీసుకున్నాం. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు అంచనాలు రూపొందించేందుకు త్వరగా సర్వే చేయిస్తాం.

– పి.రంజిత్ బాషా, జిల్లా కలెక్టర్

తాగునీటికి నిధులు కేటాయించాలి



జిల్లాలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. అక్కాయిపాలెం, పాపాయిపాలెం గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలి. చీరాల, వేటపాలెం మండలాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను యంత్రాంగం పరిష్కరించాలి.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ

రైతు సమస్యలు పరిష్కరించాలి



రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించాలి. రైతుల సమస్యలు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. పంటకాల్వలోకి సముద్రం నీరు వస్తున్నందున రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో భూగర్భజలాలు పెరగడానికి యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ ఉమ్మారెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్

పూర్తిస్థాయిలో పంట కొనాలి



బాపట్ల వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇక్కడ రైతులు పండించిన పంటలను పూర్తిస్థాయిలో ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. ప్రస్తుతం ధాన్యం అధికంగా పండింది. అయితే ప్రభుత్వం తక్కువగానే కొనుగోలు చేసింది. మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు పనులు చేయాలని మంత్రిని కోరారు.

–కోన రఘుపతి, బాపట్ల ఎమ్మెల్యే

వ్యవసాయమే ప్రధానం



వ్యవసాయంలో 70 శాతంగా శ్రమించే కౌలు రైతులను అధికారులు విస్మరిస్తున్నారు. సి.సి.ఆర్.సి కార్డుల ద్వారా అధికంగా రుణాలు ఇవ్వాలి. పసుపు సాగుచేసే రైతులకు కనీస మద్దతుధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి. బ్రిటీష్ కాలంలో నిర్మించిన గుంటూరు ఛానల్ ను పత్తిపాడు నుంచి బాపట్ల జిల్లాలోకి విస్తరింపచేయాలి. కేవలం రూ.120 కోట్ల నిధులు వెచ్చిస్తే 50 వేల ఎకరాలు సాగులోకివస్తాయి.

– కె.ఎస్.లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



చీరాలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి. వేసవిలో తాగునీటి సమస్యరాకుండా చర్యలు చేపట్టాలి. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. రైతులకు నష్టం జరుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

–కరణం బలరాం, చీరాల ఎమ్మెల్యే

సీఆర్డీఏలో పేదల ఇళ్ల స్థలాలకు ప్రాధాన్యం

- 15 నాటికి ప్లాట్ల అభివృద్ధి పూర్తి చేయాలి
- కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: సీఆర్డీఏ పరిధిలోని తుళ్లూరు, మంగళగిరి మండలాల్లోని పేదలందరికీ ఇవ్వనున్న ఇంటి స్థలాలకు సంబంధించి ప్లాట్ల అభివృద్ధి ఈ నెల 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెదకాకాని, తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధితోపాటు తాడేపల్లి, మంగళగిరి మండలాల్లోని అర్హులైన సుమారు 20 వేల మంది పేదలకు స్థలాలు మంజూరు చేయాలన్నారు. సీఆర్డీఏ పరిధిలోని మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు, ఐనవోలు గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన లేఅవుట్స్ నిరంతరం పరిశీలించాలన్నారు. ఇప్పటికే ప్రాంతంలో పేదలకు ఇవ్వాల్సిన ఇంటి స్థలాలు ఆలస్యమైందని, వెంటనే అధికారులు జంగిల్ క్లియరెన్స్, అంతర్గత రోడ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగం పెంచాలన్నారు. ప్రతి లేఅవుట్‌కు ఒక ప్రత్యేకాధికారితోపాటు ఇంటి స్థలాల మార్కింగ్‌కు 350 స్థలాలకు ఒక విలేజ్ సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను నియమించామన్నారు. పనుల పురోగతిపై ప్రత్యేకాధికారులు ప్రతిరోజూ నివేదికలు పంపాలన్నారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన కొందరు సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగమంటే బాధ్యతతోపాటు క్రమశిక్షణ కూడా ఉండాలని హితవు పలికారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, హౌసింగ్ పీడీ సాయినాథ్ కుమార్, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

- పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- కలెక్టరేట్‌లో పరిశ్రమల ఏర్పాటుపై సమీక్ష
- ఇప్పటి వరకు అందిన 211 దరఖాస్తులకు ఆమోదం



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం తగిన సహకారం అందిస్తున్నందున అవకాశాలను ఉపయోగించుకుని పరిశ్రమల ఏర్పాటుకు ఆశావహులు ముందుకు వస్తే ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ ఎల్. శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల అభివృద్ధిపై ఆ శాఖ జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా పరిశ్రమల ద్వారా కలిగే ఉపాధి అవకాశాలు, ప్రయోజనాలను చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలను స్థాపించడానికి ఆర్థిక సహాయ సహకారాలను నిజమైన లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. జిల్లాలో పక్కాగా పారిశ్రామిక విధానం 2022–23ను పక్కాగా అమలు చేయాలని సూచించారు. దీని ద్వారా ఉపాధి కల్పన అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్‌కు జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి విధానం 2015–20, 2020–23 ప్రధాన మంత్రి హామీ పథకం (పీ.ఎం.ఈ.జీ.పీ), సూక్ష్మ చిన్న తరహా సంస్థలు, క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం, జిల్లాలో పారిశ్రామిక పార్కులలో ప్లాట్ల కేటాయింపు తదితర పథకాల కింద ప్రోత్సాహకాలను, ఆర్థికసాయం అందించి పారిశ్రామిక వృద్ధిని పెంచాలని సూచించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ క్లియరెన్స్, ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులకు పెట్టుబడి రాయితీ తదితర అంశాలపై కమిటీలో అధికారులతో కలెక్టర్ చర్చించారు. అటువంటి వారిపై త్వరితంగా నిర్ణయాలను తీసుకొని పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు సింగిల్ డెస్క్ అనుమతుల కోసం 235 దరఖాస్తులకు గాను 211 ఆమోదించబడ్డాయని అధికారులు వివరించారు. పారిశ్రామిక విధానం ద్వారా పలు బ్యాంకుల నుంచి 16 మంది ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గాల వారికి వాహనాలు కొనుగోలు చేసేందుకు పెట్టుబడి రాయితీని జిల్లా కమిటీ ఆమోదించినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి ఉపాధి హామీ పథకానికి సంబంధించి 17 దర ఖాస్తులను బ్యాంకులు ఆమోదించాయన్నారు. ఇంకా బ్యాంకుల వద్ద 51 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వాటికి వెంటనే ఆమోదం పొందేలా చూస్తామని, ఇప్పటి వరకు తొమ్మిది యూనిట్ల స్థాపనకు గ్రౌండింగ్ జరిగిందన్నారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన కోసం అందరికీ అవగాహన కల్పించడం, ప్రోత్సాహం అందించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా అధికారులకు సూచించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఎ.పీ.ఐ.ఐ.సి జోనల్ మేనేజర్‌తో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోనుగుంట.. గోవులువారింట!

గోపాలకుడిగా సేవలందిస్తున్న సుబ్బారావు

- ఆవులను పోషించలేని వారి నుంచి తెచ్చి, పోషిస్తున్న వైనం
- పేడ, మూత్రంతో పిడకలు, జీవామృతం, భస్మం తయారీ
- ఉచితంగా రైతులకు పంపిణీ
- పర్యావరణ, సామాజిక సేవకుడిగా అవార్డులు
- దాతల సాయంతో పశుగ్రాసం గో క్షేత్రం ఏర్పాటు



గోశాలలో సుబ్బారావు

అద్దంకి రూరల్: హిందూ ధర్మశాస్త్ర ప్రకారం గోవును గోమాతగా, కామధేనువుగా భావిస్తారు. ఆవును పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని ప్రజల నమ్మకం. అయితే ఒకప్పుడు ప్రతి ఇంట్లో పది నుంచి వంద వరకు ఉండే ఆవులు పోషించేవారు. ఇప్పుడు కబేళాలకు విక్రయించిన దుస్థితి ఉంది. ప్రస్తుతం ఊరికి ఒకటో రెండో ఆవులు మాత్రమే ఉన్నాయంటే అతియోక్తి లేదు. ఈ పరిస్థితుల్లో లాభాలు కురిపించే బేలుదారి వృత్తిని వదిలేసి ఆవులకు తాను ఉన్నాననంటూ పట్టణానికి చెందిన గోనుగుంట సుబ్బారావు పోషించ లేని యజమానుల నుంచి ఆవులను తీసుకొచ్చి, ఆవుపాలను భక్తిపూజ కార్యక్రమాలకు ఉచితంగా అందజేస్తూ తన గోభక్తిని చాటుకుంటున్నాడు. మరోవైపు పేడతో భస్మం, మూత్రం, పేడతో ప్రకృతి వ్యవసాయానికి పనికివచ్చే జీవామృతం, కషాయం వంటివి తయారు చేస్తున్నాడు.

గోశాల, సొసైటీ ఏర్పాటు

స్వతహాగా జంతు ప్రేమికుడైన సుబ్బారావు తన దగ్గరున్న నాలుగు ఆవులతోపాటు దాతలు ఇచ్చిన ఆవులు, పోషించలేని వారిచ్చిన ఆవులను సంరక్షించే బాధ్యతను సుబ్బారావు తీసుకున్నాడు. దీంతో రూ.10 వేలు విలువ చేసే ఆవు నుంచి రూ.2 లక్షలు పలికే ఆవు వరకు మొత్తం 40 ఆవులున్నాయి. ఆవుల రక్షణ కోసం హరిహర గోకులం వేల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేశారు. గోశాలనే తన ఇల్లుగా మార్చుకుని ఆవులను సొంత బిడ్డలతో సమానంగా చూసుకుంటూ వాటి ఆలన పాలనను కుటుంబ సభ్యులు మొత్తం చూస్తుంటారు. కుటుంబంలోని బిడ్డలకు చేసినట్టే గోశాలలోని ఆవులకు కూడా అన్నప్రాసన, నామకరణం వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆవులపై ఉన్న ప్రేమను చాటుకున్నాడు.



బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డును అందుకుంటున్న సుబ్బారావు (ఫైల్)

ఆవుపేడ, మూత్రంతో జీవామృతం తయారీ

గత ఎనిమిది సంవత్సరాలుగా పంటలకు మేలుచేసే ఆవు పేడ, మూత్రంతో జీవామృతాన్ని తయారు చేసి అద్దంకి చుట్టు పక్కల గ్రామాల రైతులకు ఉచితంగా అందజేస్తున్నారు. ఆవుపేడతో పిడకలను తయారు చేసి హోమాలు నిర్వహించుకునే వారికి, పిడకలతో తయారు చేసిన విభూదిని మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు, శ్రీశైలం క్షేతంలోనూ అందజేస్తున్నాడు.

పర్యావరణ, సామాజిక సేవకుడిగా అవార్డు..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఏడాది వినాయక చవితికి మట్టితో తయారు చేసిన 10 వేల వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేయటం, శింగరకొండ వద్ద ఉన్న కోతులకు నిత్యం అరటికాయలు, పండ్లు పెట్టటం తన గోశాలలో ఆవులతోపాటు కుందేళ్లు వంటి చిరు జంతువులను పోషిస్తున్నాడు. సుబ్బారావు సేవా కార్యక్రమాలను గుర్తించిన ఢిల్లీకి చెందిన బీసీఆర్ న్యూస్ 2023 సంవత్సరానికి బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డును అందజేశారు.

పశుగ్రాసానికి దాతల సహకారం...

గోశాలలోని పశువులకు ఎటువంటి లోటు రాకుండా మేతను అందించేందుకు గో సరంక్షణ సమితి ద్వారా దాతల అందించిన సహకారంతో మేత కొనుగోలు చేస్తున్నారు. అలాగే గోశాలలోని ఆవులకు మేతను అందించాలనుకుంటున్న దాతలు అద్దంకిలోని విశ్వభారతి హరిహర గోకులం నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావుకు తెలియచేయాలని కోరారు.

6 వరకు టీటీసీ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పరీక్షల విభాగ ఆధ్వర్యంలో 42 రోజుల టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టీటీసీ) కోర్సు శిక్షణకు ఈనెల 6వ తేదీలోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైన శిక్షణ జూన్ 11 వరకు కొనసాగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఈనెల ఆరో తేదీలోపు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింటవుట్ కాపీని నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ఉన్న పరీక్షల విభాగంలో అందజేయాలన్నారు.

పులిచింతలలో రేడియల్ గేట్ పనులు ప్రారంభం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు కొట్టుకుపోయిన 16వ నెంబరు రేడియల్ గేటు స్థానంలో నూతన గేటును అమర్చే పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ప్రాజెక్టుకు 16వ నెంబరు రేడియల్ గేటు వద్ద ఉన్న యాంగ్రీ క్రేన్‌ను 22వ నెంబరు గేటు వరకు జరిపే పనిని చేపట్టారు. యాంగ్రీ క్రేన్ ప్రాజెక్టు చివరి భాగానికి వెళితేగానే 16వ నెంబరు కానాలో నూతన గేటును అమర్చేందుకు కావలసిన 100 టన్నుల క్రాలర్ హెవీలోడ్ క్రేన్‌ను తీసుకురావడం సాధ్యపడదని ఏఈ విక్రమ్ తెలిపారు. భారీ వర్షం పడటంతో సుమారు రెండు, మూడు గంటలపాటు పనులకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ క్రమంలోనే అన్నిగేట్లు అంటే 24 గేట్సుకు అమర్చిన రబ్బర్ సీల్స్‌ను తొలగించి నూతన సీల్స్ వేయవలసి ఉందన్నారు. ప్రస్తుతానికి 14,15 గేట్లకు ఉన్న రబ్బర్ సీల్స్‌ను తొలగించామని, ఇలానే అన్నింటికీ మార్చవలసి ఉందన్నారు.



పాతరబ్బరు సీల్స్‌ను తొలగిస్తున్న హెవీలోడ్ క్రేన్

7 నుంచి ఉచిత ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్), ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి ఉచిత ఐఏఎస్ ఫౌండేషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సన్ కన్వీనర్ కె.సాయికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు 10 రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో పాఠశాలస్థాయి విద్యార్థులకు సబ్జెక్టు నిపుణులతో పాటు ఉన్నతాధికారులు తరగతులను బోధిస్తారని పేర్కొన్నారు. పేర్లను నమోదు చేసుకునేందుకు 91215 14792, 72075 66702, 94939 06174 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అత్యాచార ఘటనపై కేసు

చీరాల: ఓ వివాహితపై అత్యాచారం చేసిన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న వివాహితపై అదే ప్రాంతానికి చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ సోమశేఖర్ తెలిపారు.

గడప గడపకు సంబరాలు

- 125 కిలోల కేక్ కటింగ్
- 26వ వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్న పీఆర్కే

మాచర్ల: దేశంలో పేద ప్రజలను అన్ని స్థానాలలో అగ్రగామిగా నిలబెట్టేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పథకాలను చేపట్టి ఇప్పటికే రూ.2లక్షల కోట్లు నేరుగా పేద కుటుంబాల ఖాతాలలో వేశారని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో కౌన్సిలర్ షేక్ దస్తగిరి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. భారీ ర్యాలీ నిర్వహించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి స్థానికులు స్వాగతం పలికి సమస్యలు ఆయన దృష్టికి రాగా అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం పీఆర్కే వార్డులో పర్యటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పీఆర్కే మాట్లాడుతూ నియోజకవర్గంలో 125 రోజులపాటు వివిధ గ్రామాలను సందర్శించి గృహాలకు వెళ్లి ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకొని పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ ప్రాధాన్యత నిచ్చిందన్నారు. అనేక సచివాలయాల పరిధిలో ప్రజల సమస్యలే పరిష్కార దిశగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, జలీల్, బత్తుల ఏడుకొండలు, రాష్ట్ర బ్యూటీషియన్, గ్రీనరీ డైరెక్టర్ ఉప్పలపాటి జాని, లెదర్ పార్కు రాష్ట్ర డైరెక్టర్ బూదాల మరియమ్మ, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, ఆయా వార్డు కౌన్సిలర్లు షేక్ మస్తాన్, సుభాని, మదార్ సాహెబ్, నాగుల్ మీరా, కరిముల్లా, పోలా శ్రీను, చంద్ర కుమార్, తేరాల సిద్దయ్య, మందా సంతోష్, ఎం శ్రీనివాస్, మాచర్ల చిన ఏసోబు, బి నరసింహారావు, కో ఆప్షన్ మెంబర్ యాసిన్, అనంతరావమ్మలు పీఆర్కేను సత్కరించారు. వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు అల్లావుద్దీన్, షేక్ సులేమాన్ పాషా, కణితి మస్తాన్, నాగూర్, మస్తాన్ వలి, సీలింగ్ బాషా, నక్షత్రపు శేఖర్, కమిషనర్ రమణబాబు, డీఈ జి నాగభూషణం, ఏఈ సామేల్, గౌస్, నాగూర్, షేక్ సుభానీ పాల్గొన్నారు.



125 రోజుల సందర్భంగా 125 కిలోల కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, ప్రజాప్రతినిధులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

విజయవాడ రీజియన్ పోస్టుమాస్టర్ ఆఫ్ జనరల్ డీఎఎస్‌వీఆర్ మూర్తి

రేపల్లెరూరల్: తపాలా శాఖ ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విజయవాడ రీజియన్ పోస్టుమాస్టర్ ఆఫ్ జనరల్ డీఎఎస్‌వీఆర్ మూర్తి చెప్పారు. ఓల్డ్‌టౌన్‌లోని రేపల్లె తపాలా శాఖ ముఖ్య కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. తపాలా శాఖ అందిస్తున్న పలు రకాల సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని కోరారు. తపాలాశాఖ ఖాతాలకు సంబంధించిన లావాదేవిలను మొబైల్ నెంబర్ ఫోన్‌కు అనుసంధానం చేశామన్నారు. దీని వల్ల ఖాతాదారుల లావాదేవిలకు సంబంధించి సమాచారం అందుతుందన్నారు. కార్యక్రమంలో రేపల్లె సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వాసవి, రేపల్లె పోస్ట్‌మాస్టర్ ఆనంద శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న విజయవాడ రీజియన్ పోస్టుమాస్టర్ ఆఫ్ జనరల్ డీఎఎస్‌వీఆర్ మూర్తి

ఆరు నుంచి పేర్లు రిజిస్టర్ చేసుకోండి

బాపట్లఅర్బన్: 2023–24 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేందుకు అర్హులైన పేద విద్యార్థులు ఈనెల ఆరు నుంచి పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె.రామారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐబీ (అంతర్జాతీయ), ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్ట ప్రకారం 25 శాతం సీట్లను అర్హులైన పేదలకు కేటాయిస్తూ ప్రభుత్వం రెండో నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 6 నుండి 15 వరకు హెచ్‌టీటీపీ://సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అర్హులైన విద్యార్థుల ఎంపిక మే 16 నుంచి 20 వరకు ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఈనెల 22న ఉంటుందన్నారు. విద్యార్థులు మే 24 నుంచి 28వ తేదీలోపు ఆయా స్కూళ్లలో చేరికలను ఖరారు చేసుకోవాలన్నారు. ప్రవేశాలకు సంబంధించి సమస్యలు ఉంటే 14417 టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించాలన్నారు. స్కూళ్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఒక్కొక్క విద్యార్థికి పట్టణ ప్రాంతాల్లో రూ.8 వేలు, రూరల్ ప్రాంతాల్లో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రైవేటు స్కూళ్లలో సీట్లు పొందిన పిల్లలు ఆయా స్కూళ్లకు చెల్లించాల్సిన ఫీజును నిబధనలనుసరించి అమ్మఒడిని అందుకున్న అనంతరం విద్యా సంవత్సరం చివరన ఆయా స్కూళ్లకు రీయింబర్స్ చేస్తారన్నారు. తల్లిదండ్రులు చెల్లించకపోతే ప్రభుత్వం ఆ మొత్తాన్ని తదుపరి అమ్మఒడి నుంచి మినహాయించి స్కూళ్లకు చెల్లిస్తుందని తెలిపారు. అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఏడాదికి గ్రామాల్లో రూ.1.20 లక్షలు, పట్టణాల్లో రూ.1.44 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆర్థిక బలహీన వర్గాలకు ఆరు శాతం సీట్లను కేటాయిస్తారని తెలిపారు. ఆ రిజర్వేషన్‌లో విద్యార్థులు లేకపోతే వాటిని ఇతరులకు కేటాయిస్తారు. గిరిజన ప్రాంతాల్లో మొదట ఎస్టీ పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

సమ్మర్ క్యాంపులపై ప్రచారం నిర్వహించాలి

మంగళగిరి: గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులపై విద్యార్థులు, పుస్తక ప్రియులను ఆకట్టుకునేలా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. మంగళవారం నగరంలోని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో గ్రంథాలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 13 జిల్లాలకు సంబంధించిన 2023–24 సంవత్సరానికి బడ్జెట్‌ను పరిశీలించి ఆమోదించారు. సమ్మర్ క్యాంప్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలని కోరారు.

మాతృ మరణాలను నియంత్రించాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: మాతృమరణాలను సంపూర్ణంగా నివారించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి మాతృ మరణాల సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు నెలల్లో పెదపలకలూరు, ఫిరంగిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇద్దరు తల్లులు మరణించారన్నారు. మాతృ మరణాల కారణాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి మళ్లీ అటువంటి తప్పులు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలోనే పూర్తిస్థాయి వైద్య బృందాలు అందుబాటులో ఉంటున్నాయన్నారు. గర్భిణులను మొదటి నుంచి ఫాలోఅప్ చేయడంతో పాటు ఎప్పటికప్పుడు షుగర్, బీపీ, రక్తం శాతం లాంటి పరీక్షలు చేపట్టాలన్నారు. ప్రసవానికి ముందుగానే వాహనాల్లో ఆసుపత్రులకు తరలించి జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

10, 11 తేదీల్లో మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో మెగా ఈవెంట్

గుంటూరు వెస్ట్: ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నామని మాస్టర్‌మైండ్స్ సీఏ విద్యా సంస్థల సంస్థ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. ప్రత్యేక పోస్టర్‌ను మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. మోహన్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వరరావు నేతృత్వంలో రెండు రోజులపాటు జరగనున్న ఈ మెగా ఈవెంట్‌లో సుమారు 2వేల మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. టుబాకో బోర్డ్ ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ లాంటి ప్రముఖులు ఉపన్యసిస్తారని చెప్పారు. ఈవెంట్ ఇన్‌చార్జ్ చల్లా రవి, డాక్టర్ యద్దనపూడి ఆరుద్ర పాల్గొన్నారు.



మాస్టర్‌మైండ్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

ఫ్యామిలీ డాక్టర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

డీఎంహెచ్ఓ విజయమ్మ

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బాపట్ల జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టరుపై జిల్లా వైద్యశాలలో డాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, వైద్యాధికారులు మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా సక్రమంగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, అప్తామాలిక్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి విజయమ్మ

మల్టీమీడియా రంగానికి ఉజ్వల భవిష్యత్తు

సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ జీవీఎస్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ స్థాయిలో వృత్తి విద్యా కోర్సుల్లో భాగమైన మల్టీమీడియా రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ జీవీఎస్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఐక్యూఏసీ విభాగాలు సంయుక్తంగా ఫైన్ ఆర్ట్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ మల్టీమీడియా రంగంలో కంప్యూటర్, యానిమేషన్‌లో పట్టభద్రులకు వారి వృత్తి నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉంటాయని అన్నారు. విద్యార్థి దశలో ఏ రంగంలో స్థిరపడాలన్నా కష్టించే మనస్తత్వంతో పాటు ఏకాగ్రత, అంకితభావంతో పాటు గురువులపై విధేయత ఎంతో అవసరమన్నారు. డిగ్రీలో అత్యుత్తమంగా మార్కులు సాధించిన విద్యార్థినుల ఉన్నత చదువులకు అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈసందర్భంగా విద్యార్థినులు క్లే మోడలింగ్ నైపుణ్యంతో తీర్చిదిద్దిన వివిధ రకాల ఆకృతులను తిలకించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, ఐక్యూఏసీ ఇన్‌చార్జ్ డాక్టర్ డి.మధుసూధనరావు, డాక్టర్ షాహెదా అక్తర్, మల్టీమీడియా అధ్యాపకులు ప్రవీణ్, క్లే మౌల్డింగ్ శిక్షకులు దాస్ డేవిడ్, విద్యార్థినులు పాల్గొన్నారు.



క్లే మోడలింగ్ ద్వారా తీర్చిదిద్దిన ఆకృతులను పరిశీలిస్తున్న డాక్టర్ వరప్రసాద్

థాయ్‌లాండ్ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ మేరుగ చంద్రనాగ్

వేమూరు: థాయ్‌లాండ్ దేశంలో జరిగిన కాన్ఫరెన్స్‌లో డాక్టర్ మేరుగ కిరణ్ నాగ్ పాల్గొన్నారు. గత నెల 28 నుంచి మే 1వ తేదీ వరకు థాయ్‌లాండ్ దేశంలో యునైటెడ్ నేషన్స్ న్యూయార్క్ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొన్నారు. కాన్ఫరెన్స్‌కు 75 దేశాల నుంచి యువ ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో అకడమిక్ లీడ్ పాలిన్ జి ఎగ్లేర్, డైరెక్టర్ జనరల్ ఫవాద్ అలీ పాల్గొన్నారు.



8న మాక్ పాలిసెట్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 8వ తేదీన మాక్ పాలిసెట్–2013 నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాక్ పాలిసెట్‌కు హాజరు కావచ్చునని, పరీక్ష రాసేందుకు ఎటువంటి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈనెల 8న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న మాక్ పాలిసెట్‌లో పేర్లు నమోదు చేసుకునేందుకు 83329 11155, 93907 87574 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డ్వాక్రా నిధులు దుర్వినియోగంపై కేసులు

- రూ.1.11 కోట్లు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులు
- ఫిర్యాదులపై చర్చించిన డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్

నాగాయలంక(అవనిగడ్డ): మండలంలో డ్వాక్రా సభ్యుల నిధులను వీఓఏలు స్వాహా చేశారన్న ఫిర్యాదులపై కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ వైఎస్ఆర్ క్రాంతి పథం(డీఆర్‌డీఏ)జిల్లా పీడీ పి.ఎస్.ఆర్.ప్రసాద్ మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో స్వయం సహాయక బృందాల మహిళలతో ఆ ఫిర్యాదులు, ఇతర ఆరోపణలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2021లో నాగాయలంకలోని శ్రీదుర్గ గ్రూపునకు సంబంధించి స్త్రీశక్తి నిధులు, బ్యాంకు లింకేజీ సొమ్ము రూ.91 లక్షలను వీఓఏ కనిగంటి వెంకటరమణ (రమ) దుర్వినియోగం చేసినట్లు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ వ్యవహారంలో వెలుగు సీసీ టి.విజయలక్ష్మి, వీఓఏ వెంకటరమణను ఇప్పటికే సస్పెండ్ చేశామన్నారు. తాజాగా బ్రహ్మానందపురం(వక్కపట్లవారిపాలెం)లో త్రివేణి గ్రామైక్య సంఘం వీఓఏ గాజులేటి షాలిని రూ.20.50 లక్షలు స్వాహా చేసినట్లు గ్రూపు సభ్యులు ఆరోపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ వ్యవహారంలో బ్యాంకు అధికారుల పాత్రపై అనుమానంతో అంబుడ్స్‌మెన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఈ ఫిర్యాదులపై త్వరితగతిన విచారణ చేయాల్సిందిగా కృష్ణా జిల్లా ఎస్పీ జాషువాతో మాట్లాడతామన్నారు. వీఓఏలపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సడలించిన నిబంధనల మేరకు మూడేళ్ల సర్వీసు పూర్తయిన అందరినీ మారుస్తామన్నారు. లోకోస్ యాప్ వినియోగం ద్వారా అవకతవకలు, అక్రమాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ఏరియా కోర్డినేటర్ జి.రవిబాబు, స్థానిక ఏపీఎం కె.వై.దాసు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. త్రివేణి గ్రామైక్య సంఘం వీఓఏ షాలిని రూ.20.50 లక్షలను వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నానని, త్వరలో చెల్లిస్తానని స్టాంపు పత్రాలపై లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చిన పత్రాలను పీడీ ప్రసాద్‌కు సభ్యులు చూపారు. ఏప్రిల్ 30లోగా రూ.8 లక్షలు, మే నెలాఖరుకు మిగతా మొత్తం చెల్లిస్తానని అంగీకరించి, పరారైందని వివరించారు. వీఓఏ రాసిచ్చిన పత్రాలను పీడీ పరిశీలించారు.

■ చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

పటమట(విజయవాడతూర్పు): మహిళలకు వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. రాజీవ్‌గాంధీ పార్కులో స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయాల స్టాల్‌ను ఆమె మంగళవారం ప్రారంభించారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మెప్మా ఆధ్వర్యంలో హ్యాండీ క్రాఫ్ట్ షాప్ ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. కొండపల్లి బొమ్మలు, సాఫ్ట్ టాయ్స్, సేంద్రియ ఎరువులు, ఆర్గానిక్, ఇతర ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. పార్కు సందర్శన వచ్చినవారంతా ఆయా వస్తువులు కొని స్వయం సహాయక సంఘాలను ప్రోత్సాహించాలని కోరారు. వీఎంసీ పట్టణ సాధికారాభివృద్ధి (యూసీడీ) ప్రాజెక్ట్ అధికారి శకుంతల, డ్వాక్రా మహిళలు పలువురు పాల్గొన్నారు.



స్టాల్‌ను సందర్శిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

నేడు గుంటూరు మేత్రాసనంలో రూబీ జూబ్లీ వేడుకలు

నెహ్రూనగర్: గుంటూరు మేత్రాసన పీఠాధిపతి చిన్నాబత్తిన భాగ్యయ్య గురువుగా అభిషక్తులై 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గుంటూరు మేత్రాసనం ఆధ్వర్యంలో చరిత్రలో నిలిచిపోయే విధంగా గుంటూరు డాన్ బాస్కో స్కూల్ ప్రాంగణంలో రూబీ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ కన్వీనర్ ఫాదర్ అల్లం శౌరిరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం నుంచి ర్యాలీగా ప్రారంభమై 5 గంటలకు డాన్ బోస్కో ప్రాంగణం వద్దకు చేరకుంటుందన్నారు. నిర్వాహణ కమిటీ సభ్యులు ఫాదర్లు కె.జ్యోతిరాజు, ఉన్నం కిరణ్, ఆంధ్ర క్రైస్తవ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కనపాల జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫాదర్ శౌరిరెడ్డి

'ప్రకృతి' పద్ధతులతో సాగు మేలు

రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ జాకీర్ హుస్సేన్

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ (అగ్రో ఎకో సిస్టమ్)లో సమూల మార్పులు రావాలంటే వర్షాలతో సంబంధం లేకుండా 365 రోజులు పొలాలు పచ్చగా ఉండేలా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను సాగు చేయాలని రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ జాకీర్ హుస్సేన్ సూచించారు. పశువుల అనుసంధానంతో సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మెంటార్ల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ నేల తీరును బట్టి పంటలు ఎంపిక చేసుకోవాలని, పంటల యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. వర్షాల కోసం ఎదురు చూడకుండా గాలిలోని తేమ ఆధారంగా ఎండాకాలంలో కూడా పంటలు పండించవచ్చన్నారు. ఏడాది పొడవునా పొలాలు పచ్చగా ఉండేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే నేల మృధువుగా తయారవుతుందని అన్నారు. వాస్తవానికి ప్రకృతిలో ఉన్న 99 శాతం పక్షులు మేలు చేసేవే అని, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల ఎన్నో జీవరాశులు కనుమరుగైపోతున్నాయని తెలిపారు. మిత్రపురుగులను నాశనం చేయడం వల్ల శత్రు పురుగుల రాకకు మనమే కారణం అవుతున్నామని అన్నారు. రైతు సాధికార సంస్థ అనుబంధంగా పనిచేస్తున్న రెయిన్ ఫారెస్ట్ అలయెన్స్(ఆర్ఎఫ్ఏ)సంస్థ ప్రతినిధి వినూత్న మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్‌లో భాగంగా వ్యవసాయంలో పంటలతో పాటు పశువులు, కోళ్లు, తేనెటీగలు, గొర్రెల పెంపకం ఇలా రకరకాల లైవ్ స్టాక్‌ని కూడా చేపట్టాలని శిక్షణార్థులకు వివరించారు. శిక్షణ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్ సుధాకర్, ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ రాజగోపాల్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రమణారెడ్డి, రాష్ట్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాకీర్ హుస్సేన్, వినూత్న